# 70 ఏళ్లలో జరుగని అభివృద్ధి.. పదేళ్లలో చేసింది బీఆర్ఎస్సే

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్
- గ్రామాల్లో 60 ఏళ్లు ఆయా పార్టీలు చేసిన అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

గంభీరావుపేట, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో 70 ఏండ్లలో జరుగని అభివృద్ధిని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ కేవలం పదేళ్లలో చేసి చూపించారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి గౌడ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాల యంలో ఆదివారం ఏర్పాటు చేసుకున్న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలో ఏమి అభివృద్ధి చేయలేదని కాంగ్రెస్ నేతలు మాట్లాడడం అర్థరహితమన్నారు. కేటీఆర్ సహకారంతో మండలంలోని పదేళ్లలో రూ. 10 కోట్లతో అంతర్ జిల్లాల వారధి శ్రీగాధ వంతెన, రూ.7 కోట్లతో మల్లారెడ్డిపేట వంతెన, మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యాలయం, రూ. 11 కోట్లతో మానేరు వాగుపై చెక్ డ్యాంలు, నర్మాలలో యువత ఉపాధికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో లింగన్నపేట వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించక పోవడం ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. మండల కేంద్రం నుంచి ప్రతి పల్లెకు బీటీ రోడ్డులు, గ్రామాల్లో సీసీ రోడ్డులు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ నేతలు ఊసరవెల్లి రాజకీయాలు మానుకొని ప్రాంత సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల మన్నువలు పొందాలన్నారు. కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత విమర్శలు మానుకొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నేతలు లింగన్నగారి దయాకర్‌రావు, పెద్దవేని వెంకటి, గంద్యాడపు రాజు, లింగంయాదవ్, చెవుల మల్లేశం, వెంకటస్వామిగౌడ్, రత్నాకర్, కిశోర్, నర్సింగరావు, మహేశ్, రాజేందర్, వహీద్, దేవేందర్, రమేశ్, రాజు అభిలాశ్, వేణు, శంకర్ తదితరులు ఉన్నారు.

# ప్రారంభోత్సవాలతోనే ఆగిన ధాన్యం కొనుగోళ్లు

**బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి**

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20 : ధాన్యం కొనుగోలు కేంద్రాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభోత్సవాలతోనే ఆగిపోయాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం సహకారంతో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వర్తిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నాయకులు ఉత్సాహంగా ప్రారంభించారు. కాని, అవి ఇప్పటి వరకు ఒక్క వరి గింజను కూడా మిల్లర్లకు తరలించలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పడి ఉన్న ధాన్యాన్ని చూసి రైతులు ఆవేదనకు చెందుతున్నారన్నారు. ఇప్పటి వరకు మిల్లర్ల అలాట్‌మెంట్ చేయలేదని, ధాన్యం తూకం వేసిన బస్తాల్లో ధాన్యం పూర్తిగా నిండక పోతే రైతులనే గన్నీ సంచులు తీసుకొని రావాలని నిర్వాహకులు చెప్పడంతో ఆగమవుతున్న రైతులను ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యలను పట్టించుకొని పరిష్కరించి ధాన్యం కొనుగోలు సజావుగా నిర్వహించాలని, లేకుంటే రైతులకు మద్దతుగా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

## అంగన్‌వాడీలకు 18వేల వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కరుణకుమారి

వేములవాడ, ఏప్రిల్ 20 : ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కరుణకుమారి అన్నారు. ఆదివారం వేములవాడలోని గుమ్మిపుల్లయ్య భవనంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఐసీడీఎస్ 50 ఏండ్లుగా సేవలందిస్తోందన్నారు. గర్భిణీ, చిన్నారులకు పోషకాహారం, విద్యను అందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హయాంలో నిరసన కార్యక్రమాలు చేపడితే చర్చలకు పిలిచి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుజేశారు. అంగన్‌వాడీలకు వెంటనే రూ.18 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు చొప్పరి అంజలి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, కొమిరె మంజుల, అనసూర్య, కవిత, పుష్ప, అయేషా, జ్యోతి ఉన్నారు.

## బాధితుడికి పరామర్శ

వీర్నపల్లి, ఏప్రిల్20: మండలంలోని మద్దిమల్లకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్యాట్ల రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, దవాఖానలో చికిత్స చేయించుకొని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి ఆదివారం బాధితుడిని పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ అధ్యక్షుడు గుగులోత్ విష్ణు, నేతలు అశోక్, మల్లయ్య ఉన్నారు.

## గ్రూప్-2 ర్యాంకర్‌కు సన్మానం

వీర్నపల్లి, ఏప్రిల్ 20 : ఇటీవల వెలువడిన గ్రూప్-2 ఫలితాల్లో ప్రతిభ చూపిన ర్యాంకు సాధించిన మండలంలోని శాంతినగర్‌కు చెందిన ఎస్ఐ కమటం తిరుపతి, అతడి భార్య కావ్య(ఎస్ఐ, గాంధీనగర్) లను స్థానిక నేతలు శాలువాతో సన్మానించారు. వారికి అభినందనలు తెలిపారు. నాయకులు రాజ్‌నాయక్, ప్రకాశ్‌నాయక్, సంతోష్‌నాయక్, దేవేందర్ నాయక్, గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్ ఉన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

ముస్తాబాద్, ఏప్రిల్ 20: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ గణేశ్ హెచ్చరించారు. మండలంలోని బంధనకల్ శివార్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బండి ఆంజనేయులు ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమాని హరీశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన చల్మెడ



నూతన వధూవరులతో చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ, ఏప్రిల్ 20 : కోనాయపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ చింతలకోటి రాజేశంగౌడ్ కూతురు వివాహ వేడుకకు బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మాజీ కౌన్సిలర్ గోలి మహేశ్, నాయకులు హరీశ్‌గౌడ్, రామస్వామి, స్థానిక నాయకులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు



అపూర్వ సమ్మేళనంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 20 : మండలంలోని జిల్లెళ్ల జడ్పీహెచ్ఎస్‌లో 1982-83 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం తంగళ్లపల్లి మండలం మల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆనాటి గురువులు మురలయ్య, వెంకటరావు, మోహనరావు, భూపతిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మార్కెటింగ్ వరంగల్ ఉప్పల్ శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ విశ్వనాథం, జేఎన్టీయూ రిజిస్టర్ మాధవరెడ్డి, సీహెచ్ శారద రావు, సీడీపీవో సిద్దిపేట్ ఫ్యాక్స్ డైరెక్టర్ తాండ్ర రవీందర్రావు, అత్యం లింగయ్య గౌడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంభీరావుపేట, ఏప్రిల్ 20 : మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల వేదికగా ఒక్కటై అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

## మొక్కనాటిన నూతన వధూవరులు..



మొక్కలు నాటిన నూతన వధూవరులు కట్ట విష్ణువర్ధన్-స్వాతి

బోయినపల్లి, ఏప్రిల్ 20 : రాజ్యసభసభ్యుడు మాజీ జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చా లెంజ్ క్యార్యక్రమంలో నూతన వధూవరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం బోయినపల్లి మండలం మన్వాడ గ్రామంలో వారి ఇంటి ఆవరణలో మొక్కలు నాటిన నూతన వధూవరులు కట్ట విష్ణువర్దన్-స్వాతి మాట్లాడుతూ, హరితసేనలో పాల్గొని మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉందన్నారు. వారి కుటుంబ సభ్యులు శ్రీనివాస్, రేణుక, గోవర్ధన్, అరుణ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యులు కమల్‌గౌడ్ పాల్గొన్నారు.

## కూలితేనే.. సరిచేస్తారా ?

కోనరావుపేట, ఏప్రిల్ 20 : మామిడిపల్లి గ్రామంలో పంట పొలాల మధ్య విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. దీంతో రైతులు అటుగా వెళ్లాలంటే జంకుతున్నారు. మామిడిపల్లి గ్రామానికి మల్లారం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే మేయిన్ వైర్లు కలిగిన విద్యుత్ స్తంభం సాసాల వేణు రైతు పొలంలో ప్రమాదకరంగా ఉంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సదరు రైతు వాపోతున్నాడు. ప్రమాదం జరిగితే తప్పా అధికారులు పట్టించుకోరా? అంటూ మండిపడాడు. ఇప్పటికైనా అధికారులు స్పదించి, నూతన స్తంభం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



మామిడిపల్లిలో ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభం

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వేములవాడ: మాట్లాడుతున్న అధికారి అనిల్‌కుమార్

వేములవాడ, ఏప్రిల్ 20 : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన కార్యాలయ ఆవరణలో మాట్లాడారు. వేసవికాలంలో సంభవించే అగ్ని ప్రమాదాలు జగిరినప్పుడు అప్రమత్తంగా ఉండేందుకు పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అవగాహన కల్పించామని తెలిపారు. అత్యవసరమైతే 101 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ సాయిలు, ఫైర్‌మెన్స్ శంకర్, శేఖర్, ఉపేందర్, మహేశ్, భాస్కర్, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

**అవగాహన ర్యాలీ..**

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 20 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సి, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీచౌక్ నుంచి పాతబస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో ప్రైవేట్ దవాఖానలు, సినిమా థియేటర్స్, కల్యాణ మండపాలు, షాపింగ్‌మాల్స్, విద్యా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌వో నరేందర్ మాట్లాడారు. అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు వైద్యులు ర మణా రావు, రవీందర్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ తీస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

## నీటి తొట్టెల ఏర్పాటు



నీటి తొట్టెల ఏర్పాటు చేస్తున్న యువకులు

రుద్రంగి, ఏప్రిల్ 20: గ్రామంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గ్రామానికి చెందిన యువకులు జోగినిపెల్లి నవీన్, పిల్లమరపు వెంకటేశ్ ముందుకు వచ్చి ఆదివారం మండల కేంద్రంతో పాటు అటవీ ప్రాంతంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని గండి వెంకటేశ్వర ఆలయం, బుగ్గ రాజరాజేశ్వర స్వామి అలయం, గండి హనుమాన్ ఆలయంతో పాటు ఆటవీ ప్రాంతంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల ఏర్పాటు చేసి, ఉదయం సాయంత్రం నీటిని నింపడం జరుగుతుందన్నారు. మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల ఏర్పాటు చేసిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

## సభకు అధికసంఖ్యలో తరలిరావాలి




వాల్ రైటింగ్‌తో ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్, ఏప్రిల్ 20 : మండలంలోని తుర్కపల్లి లో బీఆర్ఎస్ ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి కదిలి రావాలని బీఆర్ఎస్ నాయకులు ఇంటి గోడలపై వాల్ రైటింగ్, వాల్ పోస్టర్లతో గ్రామం గులాబీ మయంగా మారింది. గులాబీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నాయకులు దుర్గాప్రసాద్, బాలకృష్ణ, రంజిత్, దేవదాసు పాల్గొన్నారు.

## నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణ

కలెక్టరేట్, ఏప్రిల్ 20 : అర్హులైన నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణ అందిస్తూ.. ఉద్యోగాలు అందించే ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ట్రిపుల్ విన్ ప్రాజెక్టు కింద జర్మనీలో ఉపాధి అవకాశాల కోసం అర్హులైన నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణ, నియామకం లక్ష్యంగా ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ పరిధిలోని రిజిస్టర్డ్ రిక్రూట్ మెంట్ ఏజెన్సీ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించిందని జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ వెల్లడించారు. జర్మన్ ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ (బీఏ), జర్మన్ ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జీఐజెడ్) సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణలోని గుర్తింపు పొందిన కాలేజీల నుంచి జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసి, వయసు 21-38 మధ్య ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు ఫోన్ నంబర్ 94400 51581, 94400 48500,94400 52081లను సంప్రదించాలన్నారు. ఈ నెల 25వ తేదీ లోగా రెజ్యూమ్‌ను germanytriplewin2025 @ gmail.comకు మెయిల్ చేయాలన్నారు. అదనపు సమాచారం కోసం www. tomcom. telangana.gov.in సందర్శించాలని తెలిపారు.

## నష్టపరిహారం చెల్లించాలి

**కాల్వ పనులను అడ్డుకున్న రైతు**



భూమిని ధ్వంసం చేశారని చూపుతున్న రైతు నర్సయ్య

రుద్రంగి, ఏప్రిల్ 20 : ఎల్లంపెల్లి ప్రాజెక్టు వరద కాల్వ పనుల్లో భూమి కోల్పోయిన తమకు భూ సేకరణ చట్టం ప్రకారం.. నష్టపరిహారం చెల్లించాలని గ్రామానికి చెందిన రైతు దయ్యాల నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రుద్రంగి గ్రామంలోని సర్వే నంబర్ 333లో 6 గుంటలు, 313లో ఎకరం, 340లో 3 గుంటల భూమి ఎల్లంపెల్లి ప్రాజెక్టు వరద కాల్వ పనుల్లో తమ భూమి ముంపునకు గురవుతుందన్నారు. కాగా, సర్వే నంబర్ 333లో నుంచి ఒక గుంట భూమిని రెవెన్యూ అధికారులు తొలగించి భూమికి నష్టపరిహా రం చెల్లించకుండా తమ భూమిలో కాల్వ పనులు చేపడుతున్నారన్నారు. దీంతో పాటు మరి కొంత భూమిలోకి ఇరిగేషన్ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రవేశించి భూమిని ధ్వంసం చేస్తున్నారన్నారు. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం.. నష్టపరిహారం చెల్లించాలని పలుమార్లు అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

# బీజేపీ మతతత్వ పార్టీ

కరీంనగర్ తెలంగాణచౌక్, ఏప్రిల్20: కేంద్రం లోని బీజేపీ మతతత్వ పార్టీ అని, కుల మతాలకతీతంగా శాంతియుతంగా జీవనాన్ని కొనసాగిస్తున్న దేశ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బద్దంఎల్లారెడ్డి భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అణివేయాలని ఆ పార్టీ పెద్దలు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చారని దుయ్యబట్టారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అణివేయాలని చూస్తున్నారని, ఇందులో భాగంగానే 370 అర్టికల్, తలాక్ రద్దు, వక్ఫ్ బిల్లుల సవరణ చేశారని ఆరోపించారు. ముస్లింల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. దేశంలోని మావోయిస్టులను మార్చి 2026లోపు నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వరుణుడితో వణుకు..

- కల్లాలో ధాన్యం రాశులు
- కారు మబ్బులతో రైతుల్లో గుబులు
- ఆందోళనలో అన్నదాతలు



మామిడిపల్లిలో వరికోస్తున్న హార్వెస్టర్

కోనరావుపేట, ఏప్రిల్ 20 : వాతావరణంలో మార్పులతో రైతన్న గుండెల్లో గుబులు పుడుతోంది. ఇప్పటికే పంటలకు సరైన సమయంలో నీళ్లు లేక ఎండిపోయాయి. ప్రస్తుతం వరి కోత దశలో ఉండగా, ఆకాశంలో మబ్బులు ఏర్పడి చిరుజల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా మధ్యాహ్నం ఎండలు కొడుతుండగా, సాయంత్రం వేళలో ఈదురుగాలులు, మబ్బులు కమ్ముకొస్తున్నాయి. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక భయాందోళన చెందుతున్నారు.

**మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం మబ్బులు**

మండలంలో ఇప్పటికే 50 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పోస్తున్నారు. కాని, రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడా నికి జంకుతుండడంతో పాటు ఎండకు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టందుకు ఇబ్బందిపడుతున్నారు. ఇక వాతావరణంలో సాయంత్రం మార్పులు వచ్చి గాలి దుమారం రేపగా రైతులు ధాన్యాన్ని ఆగమేగాల మీద కుప్ప పోస్తున్నారు. టార్ఫాలిన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నిమ్మపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం

**ప్రారంభించారు.. కాంటా మరిచారు..**

మండలంలోని అన్ని గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కాని, కాంటాలు ప్రారంభించలేదు. ఒకవేళ ఎక్కడో ఒక చోట తూకం వేసినా వాటిని తరలించడా నికి మిల్లులు కేటాయించకపోవడం, లారీలు రాకపోవడంతో రైతులు దిగాలుతో దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం, కలెక్టర్ చొరవ చూపి మిల్లులు కేటాయించి రైతుల ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### 25 రోజులైనా ధాన్యం తూకం వేస్తలేరు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి 25 రోజులవుతున్నది. కాని, ఇప్పటివరకు తూకం వేయలేదు. అధికారులను అడిగితే ఇప్పటివరకు మిల్లులు కేటాయించలేదు. తూకం వేసి బస్తాలను ఏమిచేయమంటావు అంటూ సమాధానం చెబుతున్నరు. ఇక పొద్దంతా ఆరబెట్టడం, సాయంత్రం వేళ ఆకాశంలో మబ్బులను చూసి ఆగమాగం కుప్పలు చేయడం.. రోజంతా ఇబ్బందిగా ఉంటున్నది.

**- వంగపల్లి పరశురాములు, రైతు, కోనరావుపేట**

## ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

మల్యాల/కొడిమ్యాల, ఏప్రిల్ 20: ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. మల్యాల మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్, నూకపల్లి, మద్దుట్ల, రామన్నపేట, ముత్యంపేట, కొడిమ్యాల మండలం రామ్‌సాగర్, డబ్బుతిమ్మాయిపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే బస్తాలను మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటివరకు తూకం వేసిన వరి ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ రఘువరన్, ఆర్డీవో మధుసూదన్, నాయబ్ తహసీల్దార్లు నీతా, కిరణ్‌కుమార్, ఆర్ఐలు కరుణాకర్, తిరుపతి, ఎఫ్ఐ నర్సింహస్వామి, ఇన్‌చార్జీ ఏపీఎం పద్మ, సీసీ మంగ, తదితరులు ఉన్నారు.

## సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

మేడిపల్లి, ఏప్రిల్ 20: సర్కారు బడుల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని భీమా రం మండల ఎంఈవో యాళ్ల మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. భీమా రం మండలం గోవిందారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తర్వాత బడిబాట కార్యక్రమా నికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కరండ్ల మధుకర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## కుక్కదాడిలో నలుగురికి గాయాలు

రుద్రంగి, ఏప్రిల్ 20: కుక్క దాడిలో దాదాపు 10 మంది గాయపడిన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం, సార్గమ్మ, కుమ్మరి వాడ ఏరియాలో నడుచుకుంటు వెళ్తున్న వారిపై కుక్క దాడి చేసి, గాయపరిచింది. గాయాలైన వారిని చందుర్తి పీహెచ్‌సీకి తరలించారు.

## 23న రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్ ,ఏప్రిల్ 20 : వేములవాడ రాజన్న హుండీ లెక్కింపు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. ఉదయం 8 గంటలకు ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించనున్న హుండీ లెక్కింపులో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది విధిగా హాజరవ్వాలన్నారు.

## ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20 : మండలంలోని సోమవారంపేట గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం మాజీ ఎంపీపీ ఉట్కూరి వెంకటరమరణా రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్లమ్మ ఆలయం త్వరగా పూర్తి చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నాడు. ఆలయ అభివృద్ధికి అందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

కథలాపూర్, ఏప్రిల్ 20: కథలాపూర్ బస్టాండ్ ఏరియాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మవద్దన్నారు. సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఇక్కడ పోలీస్ అధికారులు లీలా నాయక్, రాజు, మధు, అరుణ్, తదితరులు ఉన్నారు.